# వరద ప్రాంతాల్లో మూగ జీవాల ఆకలి కేకలు

**కుక్కునూరు:** జూలై నుంచి వరుసగా మూడు సార్లు గోదావరి వరద విలీన మండలాలను చుట్టుముట్టడంతో వరద ప్రభావంతో పొలాలన్ని వరద నీటిలో మునిగి పశుగ్రాసం లేక మూగజీవాలు అలమటిస్తున్నాయి. ముంపు లేని ప్రాంతాల్లోకి తీసుకెళ్లి మేపుదామన్న ఆ భూములకు పరిహారం చెల్లించినప్పటికీ రైతులు ఆ భూములలో పంటలు వేయడంతో అటువైపుగా పశువులను మేతకు వెళ్తే సాగు రైతులు గొడవలకు దిగుతున్నారని పాడి రైతులు వాపోతున్నారు. వరద కారణంగా గ్రామంలోని ఇళ్ల ముంపునకు గురికానప్పటికీ దాదాపు అన్ని గ్రామాల్లోని పొలాలు మాత్రం వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని రైతులు అంటున్నారు. పశువులను ఇంట్లో ఉంచి వరిగడ్డి వేసి మేపుకుందామంటే గత సంవత్సరం తుఫాన్ కారణంగా వరి చేలు నీట మునగడంతో గడ్డి కట్ట రూ.150 పైగా ఉండడంతో ఎక్కువ తెప్పించుకోలేదని ఇటీవల వర్షాల నేపథ్యంలో అది కూడా నిండుకుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కుక్కునూరులో గోదావరి వరదతో బురదమయంగా మారిన పొలాలు

**ప్రభుత్వం నుంచి అందని దాణా**

గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల నేపథ్యంలో ప్రభుత్వం దాణాను ఉచితంగా అందించింది. దీంతో ఆ విపత్కర పరిస్థితి నుంచి రైతులు సునాయాసంగా తమ పశువులను కాపాడుకోగలిగారు. కాని ప్రస్తుతం రెండు నెలలో వ్యవధిలో మూడు సార్లు గోదావరి వరద చుట్టుముట్టినప్పటికీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి దాణాను పాడి రైతులకు అందించలేదని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విలీన మండలాల్లో పశువుల దాణా అందించాలని అంతేకాక జాడు విత్తనాలను కూడా అందించాలని పాడి రైతులు కోరారు.

## పశుగ్రాసం పంపిణీ చేయాలి



మాది గొమ్ముగూడెం గ్రామం, జూలై నుంచి మాకు మూడు సార్లు గోదావరి వరద వచ్చింది. దీంతో గ్రామస్తులు పునరావాస కేంద్రాలకు తరలి వచ్చాం. గ్రామం చుట్టూ ఉన్న చేలన్నీ వరద నీటిలో మునగడంతో పశువులు పశుగ్రాసం లేక అల్లాడుతున్నాయి. మాకు పశువుల దాణాను ఉచితంగా అందించాలి.

మునిగెల వంశీ, గొమ్ముగూడెం గ్రామం, కుక్కునూరు మండలం

## వైఎస్సార్‌సీపీ హయాంలో దాణా పంపిణీ



గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదలు వచ్చినప్పుడు పాడిరైతులకు ప్రభుత్వమే ఉచితంగా పశువుల దాణా పంపిణీ చేసింది. కాని ఈ ఏడాది మూడు సార్లు వరదలు వచ్చినా ఇంత వరకు ప్రభుత్వం దాణా పంపిణీ చేశారు. ప్రభుత్వం వెంటనే దాణాను సరఫరా చేసి పాడి రైతులను ఆదుకోవాలి.

రాయి రవి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు, కుక్కునూరు

# రుణాల రికవరీపై విచారణ చేయాలి

**కుక్కునూరు:** ఒక్కసారి తీసుకున్న రుణానికి రెండు సార్లు రికవరీ చేసిన విధానంపై వెంటనే సంబంధిత అధికారులు విచారణ చేసి, నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ సమావేశం మండలంలోని ఇబ్రహీంపేటలో ఎల్లంకి లక్ష్మణ్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ మండలంలోని రైతులు వ్యవసాయం కోసం 2017కు ముందు బూర్గంపాడు ఎస్‌బీఐలో రుణాలు తీసుకున్నారన్నారు. కాగా పోలవరం భూసేకరణ పరిహారం చెల్లింపు సమయంలో బ్యాంక్ అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండానే కోర్టు ద్వారా అనుమతి పొంది రైతుల ఖాతాల్లో జమ చేసిన పరిహారం నుంచి రుణాలను రికవరీ చేసుకున్నారన్నారు. మిగిలిన నగదు కోసం వెళ్లిన రైతుల ఖాతాల నుంచి మరోసారి రుణాన్ని రికవరీ చేసుకున్నారన్నారు. అలా రైతుల ఖాతా నుంచి రెండు సార్లు రుణాన్ని జమ చేసుకున్నారని వాపోయారు. దీనిపై వెంటనే విచారణ జరిపి నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నలజాల సూర్యం, వీరవెంకయ్య, సత్తెనపల్లి బుల్లయ్య, వేముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకటాచారి

# 17న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

**కొయ్యలగూడెం:** ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామని బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యులు వి.సత్యనారాయణ, ఎం.గీతారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలో 24 పాఠశాలలు, 32 అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 6231 మందికి నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. కొయ్యలగూడెం పీహెచ్‌సీ పరిధిలో 59 పాఠశాలలు, కళాశాలలు, 55 అంగన్‌వాడీ కేంద్రాలలో 10075 మందికి లక్ష్యంగా మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొయ్యలగూడెం మండలం మొత్తం 63 పాఠశాలలు, కళాశాలలు, 87 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16,306 మందికి నులి పురుగుల మాత్రల పంపిణీకి లక్ష్యంగా మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

## క్లుప్తంగా

### ముత్యాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

**చింతలపూడి:** పట్టణంలో ముత్యాలమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వెలమపేటకు చెందిన ముత్యాలమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను 9 రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వెలమపేటలో వేంచేసియున్న ముత్యాలమ్మను భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముత్యాలమ్మ దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ముగిసిన స్కూల్ గేమ్స్ ఎంపికలు


జెడ్పీ హైస్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు పీడీ జయరాజు తెలిపారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 12, 13 తేదీల్లో రెండు రోజులు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. తొలి రోజు చెస్, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, రెండో రోజు కోకో, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 300 మంది ఉత్సాహంగా పాల్గొనగా, మండలంలో పని చేస్తున్న 15 మంది పీడీలు ఈ ఎంపికలు నిర్వహించారన్నారు. ఎంఈవోలు రాముడు, రాములు, హెచ్ఎం లోవకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు విద్యార్థుల సాయం


విరాళం అందజేస్తున్న విద్యార్థులు


**కామవరపుకోట:** ఇటీవల వర్షాలతో ముంపునకు గురైన విజయవాడ వరద బాధితులకు సహాయార్థం మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు, విరాళాల సహాయం ద్వారా వచ్చిన రూ.18,116 నగదును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపే నిమిత్తం ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజుకు అందజేశారు. విరాళాలు సేకరించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను గ్రామస్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఘనంగా హిందీ దినోత్సవం


లీలా కుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**ద్వారకాతిరుమల:** మండలంలోని గుణ్ణంపల్లి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దినోత్సవాన్ని హెచ్ఎం వర ప్రకాశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషపై పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం హిందీ పండితురాలు లీలా కుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం భారతిదేవి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలి


మండల స్థాయి ఆటల పోటీల్లో ఎంపికైన విజేతలు

**లింగపాలెం:** వివిధ క్రీడల్లో మండల స్థాయిలో విజయం సాధించిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి మండలానికి పేరు తీసుకు రావాలని ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అలివేలు మంగతాయారు అన్నారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం శింగగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన మండల స్థాయి క్రీడల పోటీలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకురాలు నళిని, మండలం గేమ్స్ సమన్వయ అధికారి పీహెచ్‌వీ ప్రకాష్‌రెడ్డి, టి.ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ నేత అశోక్ మృతి


అశోక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు


మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

**కామవరపుకోట:** మండలంలోని కళ్ళచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్‌లో అశోక్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్యంపై ఆరా తీసి, ధైర్యం చెప్పారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో ఆయన కన్ను మూశారు. దీంతో మండల వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అశోక్ పుట్టిన గ్రామం ఉంగుటూరు మండలం బొమ్మిడి కాగా, కళ్లచెరువు వచ్చి స్థిరపడ్డారు. 2009లో చింతలపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా సేవలందించారు. ఆయన భార్య విజయలక్ష్మి కామవరపుకోట మండలం ఎంపీపీగా, కుమార్తె నమ్రత మండలంలోని కేఎస్ రామవరం పంచాయతీ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేశారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఎమ్మెల్యే సొంగా రోషన్, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ ఆయన భౌతికకాయం వద్ద పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు.

**అశోక్ మృతికి సంతాపం**

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ మృతి పార్టీకి తీరని లోటని టి.నరసాపురం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుటుంబానికి అశోక్ సన్నిహితుడని తెలిపారు. శ్రీనురాజుతో పాటు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్ మృతికి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, దేవరపల్లి ముత్తయ్య, వాసిరెడ్డి మధు, పిన్నమనేని చక్రవర్తి, మొరవనేని అనిల్, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, కాళ్ళీడి సుబ్బారావు, యర్ర గంగాధర్ రావు, బొంతు అంజిబాబు, తదితరులు ఉన్నారు.

# గంగ చెంతకు గణనాథుడు


కొయ్యలగూడెం: గణపతి ఊరేగింపు దృశ్యం


లింగపాలెం: గణనాథుడిని కూరగాయలతో అలంకరించిన దృశ్యం


ద్వారకాతిరుమల: ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు


ద్వారకాతిరుమల: క్షేత్రంలో ఊరేగుతున్న గణనాథుడు

- క్షేత్రంలో అట్టహాసంగా నిమజ్జన వేడుకలు
- అలరించిన శక్తి వేషధారణలు
- పలు చోట్ల భారీ అన్న సమారాధనలు

**ద్వారకాతిరుమల:** క్షేత్రంలో గణేష్ నిమజ్జన వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక ఆర్చిగేటు కూడలిలో, అలాగే ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద నెలకొల్పిన గణనాథులకు ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రంలో ఊరేగించారు. పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో గణేష్ విగ్రహాలను నిమజ్జన చేశారు. ఇదిలా ఉంటే స్థానిక సొసైటీ పెట్రోల్ బంకు సమీపంలో మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

**కొయ్యలగూడెం:** గణపతి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అలాగే గణపతి నవరాత్రుల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా చేస్తున్నారు. గణపతిని వాహనంపై ఊరేగిస్తూ తీన్‌మార్ డప్పులు, డీజేలు, విచిత్ర వేషధారణల నడుమ కోలాహలంగా నిమజ్జనానికి తీసుకెళుతున్నారు. శుక్రవారం కొయ్యలగూడెం వెంకయ్యపాలెం రామాలయం గణపతిని ఊరేగించి, అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

**గణనాథుడికి కూరగాయలతో అలంకరణ**

**లింగపాలెం:** ధర్మాజీగూడెం పడమట రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి శుక్రవారం భక్తులు కూరగాయలతో అలంకరించారు. కూరగాయలతో అలంకరించిన వినాయకుడి విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

**లడ్డూ వేలం**

లింగపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి వారికి ప్రసాదంగా సమర్పించిన లడ్డూను, అలంకరణ నిమిత్తం వేసిన డబ్బుల దండ, పూల దండలను వేలం నిర్వహించారు. ఈ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా ప్రసాదంగా ఉంచిన రెండు లడ్డూల్లో ఒక లడ్డూని వేంపాటి సత్యనారాయణ, లక్ష్మి దంపతులు రూ.25 వేలకు, మరో లడ్డూను ఆచంట నాగేశ్వరరావు, నాగలక్ష్మి దంపతులు రూ.60 వేలకు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే స్వామి వారి మెడలోని డబ్బుల దండను మేడూరి మణికంట, మాధురి దంపతులు రూ.7600కు, మెడలోని పూలమాలను మద్రిపాటి వెంకటేశ్వరరావు రూ.1900కు దక్కించుకున్నారని తెలిపారు.

# చిరస్మరణీయుడు ఏచూరి


ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

**జంగారెడ్డిగూడెం:** జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేసిన గొప్ప ఉద్యమకారుడు, చిరస్మరణీయుడు సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం సీపీఎం మండల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆఫీసులో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళి అర్పించారు. జి.సూర్య కిరణ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎం.జీవరత్నం మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మండల టౌన్ కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్ రావు, వంగ గోపి, నాయుడు వెంకన్న, కార్మిక నాయకులు డి.ఆశీర్వాదం, స్టాలిన్, పి.సునీల్, పి.వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి మార్క్సిస్టు మేధావి పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం ప్రజలకు, కార్మికులకు తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీపీఎం కొయ్యలగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆలయన ఆశయాలను ముందుకు తీసుకెళతామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఆకుల దుర్గారావు, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.

**సీపీఐ సంతాపం:**

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి చెందడం బాధాకరమైన విషయమని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, మండల సహాయక కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు తెలిపారు. ఏచూరి సీతారాం మృతి పట్ల సీపీఐ తరపున సంతాపం తెలియజేస్తున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

**వేలేరుపాడు:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం వేలేరుపాడు మండల కార్యదర్శి ధర్మల రమేష్ జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు పేర్కొన్నారు. కొత్తూరులో కరటం ప్రకాష్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఊకె రాజులు, తొండ సీతయ్య, సవలం లింగయ్య, ఊకె ముత్యాలు, పురేం కిట్టయ్య, సోడే ప్రసాద్ సవలం భీమమ్మ, సీతమ్మ ధర్మల నాగేంద్రబాబు పాల్గొన్నారు.

# వర్షపు నీటితో ఇబ్బందులు

**పోలవరం రూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామంలో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీరు నిలిచిపోవడంతో పాటు ఆకుపచ్చగా మారి దుర్వాసన వెదజల్లే పరిస్థితి ఏర్పడింది. పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు పెరిగిపోయాయి.

**నీరు మళ్లించే పనులు ప్రారంభం:**

సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నిల్వ నీటిని ఇంజన్‌లు ఏర్పాటు చేసి బయటకు తరలించే పనులు చేపట్టారు.


ఇళ్ల చుట్టూ పసర్లు పట్టిన వర్షపు నీరు

## పోషకాహారంపై అవగాహన సదస్సు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** పోషకారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించొచ్చని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. జంగారెడ్డిగూడెం హరిజనపేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో బ్యూలా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవో 85 రద్దు చేయాలి


పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు

**టి.నరసాపురం:** జీవో 85ను వెంటనే రద్దు చేయాలని వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బొర్రంపాలెం పీహెచ్‌సీ వద్ద వైద్యులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌కే ఇమాంబీ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 85ను ఇవ్వడం దారుణమన్నారు. 85 జీవోతో వైద్యాధికారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అకస్మాత్తుగా జీవోలు మార్చడం వలన తమ వృత్తికి, ప్రగతికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 85ను రద్దు చేయడంతో పాటు వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఎం ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నూకాలమ్మకు ప్రత్యేక పూజలు


నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

**జంగారెడ్డిగూడెం:** నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించడంతో పాటు ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారి వెండి చీర తయారీకి స్థానిక తల్లాడి సత్తిబాబు కనకదుర్గ దంపతులు 50 తులాల వెండిని అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రాట పూజా కార్యక్రమం

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలో వేంచేసియున్న వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవ రాత్రుల మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఘనంగా రాట ముహూర్తంతో పనులు ప్రారంభించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాట పాతి పూజలు నిర్వహించారు. ఈ రాట పూజ అనంతరం దసరా శరన్నవ రాత్రుల పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో టీపీఏ రామతారకం, మహంకాళి రామ్మోహనరావు, కర్పూరం జనార్ధన్, వాసవి సాయి నగేష్, ఇమ్మడి బాల భాస్కర్, చిని భాస్కర్ గుప్త, కొల్లేపర ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.